క్లుప్తంగా

ఏయూలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలోని హ్యూమన్ జెనిటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ అండ్ డైటెటిక్స్‌లో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రొమ్ము క్యాన్సర్‌పై స్క్రీనింగ్ నిర్వహించారు. శిబిరాన్ని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రారంభించి, పలు సూచనలిచ్చారు.

దుకాణం వద్ద రెండు చెత్త బుట్టలు తప్పనిసరి



చెత్త బుట్టల ఏర్పాటుపై దుకాణదారుడికి అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ: ప్రతి దుకాణం వద్ద యజమానులు రెండు చెత్త బుట్టలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఇటీవల జీవీఎంసీ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం 9వ వార్డు విశాలాక్షినగర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ పారిశుధ్య కార్మికులతో కలిసి దుకాణదారులకు అవగాహన కల్పించారు. వ్యాన్‌కు బ్యానర్లు కట్టి వీధుల్లో ప్రచారం చేశారు. దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేసేందుకు షాపు ముందు రెండు బుట్టలు ఉంచాలని సూచించారు. దుకాణాల ముందు చెత్త పడి ఉన్నట్లయితే ఆ షాపు యజమానికి రూ.1,000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వార్డులోని దుకాణదారులందరూ సూచనలు పాటించాలన్నారు.

22 నుంచి మాలధారులకు నిత్యాన్నదానం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి డిసెంబర్ 5 వరకు వివిధ మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ తెలిపారు. కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. 9 ఏళ్ల కిందట ప్రారంభించిన నిత్యాన్నదానాన్ని ప్రతి ఏటా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. దాతల సాయంతో 41 రోజుల పాటు భిక్ష కొనసాగుతుందని చెప్పారు. మాలధారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ హితంగా దీపావళి



గ్రీన్ దివాళీ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏయూ విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థులు

మద్దిలపాలెం: పర్యావరణ హితంగా దీపావళి పండగను జరుపుకోవాలని కోరుతూ ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ దివాళీ ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీన్ దివాళీ ఎలా జరుపుకోవాలనేది వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షారోన్‌రాజు మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసేలా దీపావళి జరుపుకోవడం వల్ల భావితరాల వారికి బాటలు వేసిన వాళ్లమవుతామన్నారు. మట్టి ప్రమిదలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా విభాగం ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దృష్టి లోపం గల విద్యార్థులకు ఆధార్ సేవలు

మహారాణిపేట: ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ (గర్ల్స్) ఎండాడ విద్యార్థుల కోసం రెండు రోజుల పాటు ఆధార్ నమోదు, నవీకరణ కార్యక్రమం నిర్వహించామని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. దృష్టి లోపం గల బాలికల పాఠశాలలో ఆధార్ బృందం మొత్తం 24 మందికి ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్ నిర్వహించారన్నారు. అన్ని వర్గాల వారికి ఆధార్ సేవలను విస్తరించాలని పోస్టల్ శాఖ నిరంతరం ప్రయత్నాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని పోస్టల్ అధికారులు తెలిపారు.

నడిరోడ్డుపై పశువుల స్వైరవిహారం



ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలి మధ్యలో గుంపులుగా సంచరిస్తున్న పశువులు



పశువుల స్వైరవిహారంతో ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

- ఎంవీపీ కాలనీలో యథేచ్ఛగా సంచారం
- ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం
- ఫిర్యాదులు పట్టించుకోని వెటర్నరీ అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో పశువులు స్వైరవిహారం చేస్తున్నాయి. టీటీడీ కూడలి, సెక్టార్-9 డీఆర్‌డీఏ కార్యాలయం, సెక్టార్-7లోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. కాలనీలో పెద్ద ఎత్తున సంచరిస్తున్న పశువులు రాత్రి పూట డస్ట్ బిన్ల వద్దకు చేరి వ్యర్థాలను విచ్చలవిడిగా రోడ్లపైకి లాగుతూ పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. నిత్యం రోడ్లపై సంచరిస్తూ వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్నట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. టీటీడీ కూడలి మధ్యలో గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. టీటీడీ కూడలి, ఎంవీపీ సర్కిల్, గిరిజన భవన్ సర్కిల్ ఇలా అనేక చోట్ల గుంపులుగా తిరుగుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రాత్రి ఎంవీపీ రైతుబజార్‌కు చేరుకుని వ్యర్థాలను వెదజల్లుతున్నాయి. పశువుల బెడదపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ, వెటర్నరీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు రోపిస్తున్నారు. రోడ్లపై యథేచ్ఛగా వదిలేయొద్దని పశువుల యజమానులకు సూచించినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమస్య పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

చురుగ్గా కోటి సంతకాల సేకరణ



మద్దిలపాలెంలో సంతకాలు సేకరిస్తున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు



కోటి సంతకాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ 12వ వార్డు నాయకులు

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని శుక్రవారం 23వ వార్డు మద్దిలపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. మెడికల్ కాలేజీల పరిరక్షణకు మద్దతుగా సంతకాలు సేకరించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, జిల్లా గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి బోర రాముమరెడ్డి, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం కార్యదర్శి కె.వి.రమణ, గుడ్ల నర్సింగ్ రెడ్డి, బోయి రమణారెడ్డి, సరగడ రమణమ్మ, సరగడ భూలోక రెడ్డి, అవ్వ నర్సింగ్‌రావు, గేదెల వెంకటలక్ష్మి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ, పంపిణీ

ఆరిలోవ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కోసం ముద్రించిన కరపత్రాలను శుక్రవారం 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. సంతపాలెంలోని పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్, పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి కార్యకర్తలకు కోటి సంతకాలపై దిశానిర్దేశం చేసి, కరపత్రాలను అందజేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వార్డులో ఎక్కువ మందితో సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు బుడుమూరు వినోద్, ఒమ్మి వెంకట ప్పారావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, సూర్యారావు, అర్జున్, జేమ్స్, మోహన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) ఏయూ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీలోని టి.ఎల్.ఎన్. సభా హాల్‌లో భగత్‌సింగ్ పేరిట మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శతాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి సంపూర్ణ సహకారం కోరారు. భగత్‌సింగ్ వంటి స్వతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఎఫ్ఐ కమిటీని ప్రశంసించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ భగత్‌సింగ్ వంటి విప్లవ యోధుడి స్ఫూర్తిని నేటి యువతలో నింపే ప్రయత్నంలో భాగంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. 126 మంది ఏయూ విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, జిల్లా అధ్యక్షుడు జి.అజయ్, యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, అధ్యక్షులు ఎం.కుసుమాంజలి, నాయకులు ప్రగతి, సోమేష్, తరుణ్, హరిణి, హర్షిత్, నరేష్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా పబ్లిసిటీ వింగ్‌లో ఆరుగురి నియామకం

ఆరిలోవ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగ కమిటీ పబ్లిసిటీ వింగ్‌లో ఆరుగురిని నియమించారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శులుగా పాత్రో శ్రీనివాసరావు, వెలంశెట్టి జి.జ్యోతిప్రకాష్, ఉద్దా భాస్కర్‌రావు, కార్యదర్శులుగా కనకాల కృష్ణ, గమ్మువరపు కామేశ్వరరావు, మార్పు శేషుకుమార్‌లను నియమించారు.

బీసీలపై దాడులు అరికట్టాలి

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గంపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆల్ ఇండియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. అమరావతిలో శుక్రవారం మంత్రులు ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్‌లను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. బీసీలపై దాడులను అరికట్టడానికి ప్రత్యేకంగా బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల రుసుమును పెంచాలని, పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేయాలని, పదోన్నతుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలని, జన గణనతోపాటు కుల గణన జరపాలని విన్నవించారు. కాపు వర్గీయులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యమివ్వాలని కోరారు. జి.శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతోనే మెరుగైన ఫలితాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: విద్యలో రాణించేందుకు దృఢ సంకల్పంతో విద్యార్థులు ముందుకు సాగాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. ఏయూలో శుక్రవారం ప్రపంచ సాంఖ్యాకశాస్త్ర దినోత్సవాన్ని ఆంధ్రా యూనివర్సిటీ సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి, జనాభా పరిశోధన కేంద్రం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్. బి. మునిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యాభ్యాసంలో మెలకువలు, విద్య, ఉద్యోగ సాధనలో ఏం చేయాలో వివరించారు. అలాగే స్టాటిస్టిక్స్ ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు. ప్రొఫెసర్ బి. మునిస్వామి మాట్లాడుతూ సాంఖ్యాక శాస్త్ర ఆవశ్యకత, వివిధ అంశాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఆయా అంశాలు దేశాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తాయన్నారు. ఈ స్టాటిస్టిక్స్ ఏ విధమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందో వివరించారు. వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు కె. శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బీచ్‌రోడ్డు: వీఎంఆర్‌డీఏ(వుడా) పార్క్ వెనుక గల చాకలిరేవు వద్ద శుక్రవారం గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న దేవరాపల్లి నూకరాజు శుక్రవారం వుడా పార్కు వెనుక వైపు పర్యవేక్షణ నిమిత్తం వెళ్లడంతో.. అక్కడ జనం గుమిగూడి ఉండటాన్ని గమనించి దగ్గరకు వెళ్లారు. అక్కడ మృతి చెంది ఉన్న వ్యక్తి సమాచారాన్ని పోలీసులు అందించారు. సుమారు 50-55 ఏళ్ల వయసు, ఐదడుగుల ఎత్తు గల వ్యక్తి మృతదేహం కనిపించడంలో అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. నాలుగు రోజులు కిందట అతడు మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే మూడో పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రైల్వే హాస్పిటల్‌లో డయాలసిస్ యూనిట్ ప్రారంభం



నూతన డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, జ్యోత్స్న బోహ్రా

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని వాల్తేర్ డివిజన్ రైల్వే హాస్పిటల్‌లో నూతన డయాలసిస్ యూనిట్‌ను శుక్రవారం డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ యూనిట్‌ను ఎస్‌ఏపీ మెడికల్స్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా రైల్వే ఉద్యోగులు, వారి భాగస్వాములు, కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, రైల్వే హాస్పిటల్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

దాబాగార్డెన్స్: విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్‌రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేసినా.. సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగారు. ఈమేరకు శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం (సర్కిల్ ఆఫీస్) వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకుడు శ్రీనివాస్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకారం

దాబాగార్డెన్స్: స్వర్ణకార సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పాతనగరం టౌన్ హాల్ వద్ద ఉన్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి మాత చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ నూతనంగా ఎన్నుకున్న సంఘ అధ్యక్షుడు కర్రి త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి పాటోజు రామకృష్ణ నాని, కోశాధికారి కర్రి రాజశేఖర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ గోడి నరసింహాచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, సంఘం ప్రతినిధులు మారోజు ఆచారి, డొంక నానాజీ తదితరులు పాల్గొన్నారు.


ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



ఆరిలోవలో టెన్త్ విద్యార్థి ఇంటి వద్ద పుస్తకాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: గ్రామ సందర్శనం కార్యక్రమంలో భాగంగా తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయిని భవాని ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆరిలోవలోని పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పలకరించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అవగాహన కల్పించారు. పుస్తక పఠన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్.ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.500 రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజకు దంపతులు లేదా ఇద్దరు భక్తులను అనుమతిస్తామని చెప్పారు. ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు తులసి పూజ

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

అలరించిన గాత్ర సంగీత వాద్య కచేరీ



జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభిస్తున్న కొణతాల రాజు, రాజశేఖర్

సీతంపేట: మెలోడీ క్రియేటర్స్ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గాత్ర సంగీత వాద్య కచేరీ అలరించింది. కళాశాల సంస్థల ప్రతినిధి కొణతాల రాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బి.కామేశ్వరశర్మ వయోలిన్‌తో సంకీర్తనలు పలికించి, గాత్ర ధారణ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వీరికి మృదంగంపై ఎ.కౌండిన్య, తబలాపై బి.రమణమూర్తి, ఆర్గాన్‌పై సోమేష్ వాద్య సహకారం అందించారు. నవచైతన్య జానపద కళాకారుల చిన్న రెడ్డి బృందం జానపద గీతాలు ఆలపించి చక్కని నృత్యం చేశారు. మెలోడీ క్రియేటర్స్ 25వ వార్షికోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, కె.వెంకట సురేష్, ఎస్.నారాయణస్వామి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం





ఎంవీపీ కాలనీలోని ఫుట్‌పాత్‌లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

- ఎంవీపీ కాలనీలో ఫుట్‌పాత్‌లపై పడి ఉన్న విద్యుత్ వైర్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని పలు చోట్ల విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఫుట్‌పాత్‌లను ఆనుకొని గతంలో ఈపీడీసీఎల్ భూగర్భ విద్యుత్ వైర్ల లైన్లు నిర్మించిన విషయం తెలిసిందే. వాటి ద్వారా ఫుట్‌పాత్‌లను ఆనుకుని ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల బడ్డీలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లోని ఫుట్‌పాత్, కూడళ్లలో ఇలాంటి కనెక్షన్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇటీవల జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఆపరేషన్ లంగ్స్ పేరిట ఫుట్‌పాత్‌లపైనా, వాటిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోని బడ్డీలను తొలగించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో బడ్డీలకున్న విద్యుత్ కనెక్షన్లను సైతం తొలగించారు. ఆయా వైర్లను ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'మ్యాథ్ మ్యాట్రిక్స్ 2కే25'



మ్యాథ్ మ్యాట్రిక్స్ ఈవెంట్‌లో అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

కంచరపాలెం: విద్యార్థుల్లో మేధా కౌశలం, అంతర్గత ప్రతిభా పాటవాలను ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల గణిత పోటీలు ఎంతో దోహదపడతాయని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. గణిత విభాగం, గణాంక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మ్యాథ్ మ్యాట్రిక్స్-2025 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమగ్ర విద్య లెక్చరర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, ద్వితీయ భాషల పూర్వాధిపతి డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, ఏయూ గణిత ఆచార్య శర్మ మాట్లాడారు. నగరంలోని పలు కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు క్విజ్, సుడోకో, మైండ్ మేస్, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కెప్టెన్ కె.సుజాత, కె.కె.సౌజన్య, జి.యోజన, లక్ష్మి, ఎస్.శ్రీరామ్, గౌరీశంకరరావు, సునీత చౌదరి, వి.భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న సీఐ బాబు

కంచరపాలెం: సమాజంలో సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నందున యువత జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు 9440796019 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఇన్‌చార్జి డాక్టర్ సుజాత, కృష్ణకుమారి, పి.కె.జయలక్ష్మి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.